సాక్షి
వైఎస్సార్ జిల్లా
శుక్రవారం ǀ 10 ǀ అక్టోబర్ ǀ 2025



కొత్త కష్టాలు!
కూటమి సర్కార్ తీరు ఆర్టీసీ అద్దె బస్సు యజమానులకు కొత్త కష్టాలను తెచ్చి పెడుతోంది. ఆర్టీసీ అద్దె బస్సులకు సంబంధించి యాజమాన్యాల సమస్యలను గాలికొదిలేసింది. - IIలో



స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి
త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇప్పటినుంచే తగిన ప్రణాళికలు రూపొందించాలని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. - IIలో

I
గరిష్ఠం/కనిష్ఠం
32.8 /25.6
వాతావరణం
జిల్లాలో గురువారం 25.6 – 32.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్‌ : జిల్లాలోని ఎర్రగుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు బోటనీ పాఠ్యాంశాలు బోధించడానికి గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ త్రివిక్రమ్‌రెడ్డి తెలిపారు. బోధనలో పూర్వ అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలసరి గంటల పరిమితిలో గరిష్ఠం రూ. 27 వేలు గౌరవ వేతనం ఉంటుందని తెలిపారు. అర్హత ధ్రువపత్రాలతో కూడిన దరఖాస్తులను ఈ నెల 14వ తేదీ నాటికి కళాశాల కార్యాలయానికి చేరాలని ప్రిన్సిపాల్ సూచించారు.

23 మందికి షోకాజ్ నోటీసులు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న 23 మంది మహిళా పోలీసులకు మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గత శని, ఆదివారాల్లో జీఎస్టీతోపాటు ఇన్సూరెన్స్‌పై కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరు కాలేదని 23 మందికి నోటీసులు జారీ చేశారు.

బాధ్యతల స్వీకరణ



జేడీగా బాధ్యతలను స్వీకరిస్తున్న శ్రీనివాసులు

కడప అగ్రికల్చర్‌ : జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి(పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్)గా శ్రీనివాసులు గురువారం కడప జిల్లా కేంద్రంలోని జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన పులివెందులలోని పశుసంవర్ధకశాఖ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిగా వచ్చారు. ఈ మేరకు ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఇదివరకు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిగా పనిచేస్తున్న శారదమ్మ పులివెందులలోని పశుసంవర్ధకశాఖ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి జాయింట్ డైరెక్టర్‌గా వెళ్లారు.

11న రాష్ట్రస్థాయి ఖోఖో ఎంపికలు

కడప వైఎస్సార్ సర్కిల్ : కృష్ణాజిల్లా లోని గన్నవరం హైస్కూల్ క్రీడా మైదానంలో ఈ నెల 11న రాష్ట్రస్థాయి డైరెక్ట్ నేషనల్ సెలక్షన్స్ జరుగుతాయని అన్నమయ్య, వైఎస్సార్ ఉమ్మడి జిల్లా ఖో ఖో సంఘం అధ్యక్షుడు డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి, కార్యదర్శి జి. నరేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ ఎంపికైన వారు ఈ నెల 24 నుంచి 26 వరకు కర్నాటకలో సీనియర్స్ సౌత్ జోన్ ఖో ఖో జాతీయ టోర్నమెంట్‌లో పాల్గొనవలసి ఉంటుందన్నారు. సౌత్ జోన్ ఎంపికలు ఉమ్మడి కడప జిల్లా నుంచి ఎవరైనా ఆసక్తి కలిగిన వారు పూర్తి వివరాలకు 8499713690 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రారంభమైన కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్‌ : నూతనంగా ఎంపికైన గురువులకు పోస్టింగ్ కేటాయింపుల కోసం గురువారం కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఇందులో స్కూల్ అసిస్టెంట్లకు మదనపల్లి ట్రైనింగ్ కేంద్రంలో కాగా ఎస్‌జీటీ ఎంపికలకు కడప గ్లోబల్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో డీఈఓ షేక్ షంషుద్దీన్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ప్రారంభమయింది. ఈ కౌన్సెలింగ్ శుక్రవారం కూడా కొనసాగనుంది.

13 నుంచి టాలెంట్ హంట్

కడప వైఎస్సార్ సర్కిల్ : అండర్ 12, 14, 16,19 క్రికెట్ క్రీడాకారులకు టాలెంట్ హంట్ జరుగుతుందని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ. రెడ్డి ప్రసాద్ తెలిపారు. ఈనెల 13 నుంచి 16 వరకు జిల్లాలో ఈ టాలెంట్ హంట్ ఏసీఏ నుంచి కె. రవిశంకర్ టాలెంట్ కమిటీ మెంబర్ విక్నేష్ సెలక్షన్స్ పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. మంచి ప్రావీణ్యం ఉన్న క్రీడాకారులను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 13న అండర్- 12 క్రీడాకారులు,14న అండర్- 14 క్రీడాకారులు, 15న అండర్ -16 క్రీడాకారులు 16న అండర్ -19 క్రీడాకారులు హాజరుకావాలన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ కిట్‌తో పాటు ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్, ప్రస్తుత స్టడీ సర్టిఫికెట్, ఒక పాసుపోర్టు సైజు ఫొటోతో వైఎస్సార్ ఏసీఏ క్రికెట్ స్టేడియానికి ఉదయం 8 గంటలకు హాజరుకావాలన్నారు.

మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలి

కడప ఎడ్యుకేషన్‌ : విద్యార్థులు మానసిక ఒత్తిడికి దూరంగా ఉన్నప్పుడే మంచి ప్రతిభను సాధించగలరని దీంతో మంచి విజయాలను సాధించగలరని సమగ్రశిక్ష జీసీడీఓ దార ఆరోగ్య మేరీ అన్నారు. కడప నగరం చిన్నచౌకులోని ప్రభుత్వ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలలో భాగంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రశాంతమైన జీవనశైలి, ప్రణాళికాబద్ధమైన దినచర్య ఉంటే శారీరకంగా మానసికంగా బలిష్ఠంగా ఉంటారని తెలిపారు.

పార్టీని బలోపేతం చేద్దాం

- రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోంది
- లక్షల కోట్లు దోచుకోవాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు
- ఏ ముఖ్యమంత్రి ఇంత దిగజారి ప్రవర్తించలేదు
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి .చిత్రంలో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, పార్టీ నేతలు

కడప కార్పొరేషన్ : గ్రామ స్థాయి నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దామని ఆ పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం రామాంజనేయపురంలోని నూతన జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులు పండించిన ఏ పంటలకు సరైన గిట్టుబాటు ధర లేదన్నారు. లక్షకోట్లు విలువజేసే మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. సహజ వనరులను దోచుకుంటున్నారని, రోజా లక్షల కోట్లు దోచుకోవాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని కూటమి తీరుపై దుయ్యబట్టారు. తాను 7 సార్లు ఎమ్మెల్యేగా గెలిచాను, ఏ ముఖ్యమంత్రి ఇంత దిగజారి ప్రవర్తించలేదన్నారు. పెదబాబు, చినబాబుకు తెలియకుండానే నకిలీ మద్యం స్కాం జరిగిందా అని సూటిగా ప్రశ్నించారు.

- పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో నకిలీ మద్యం ఏరులైపారిందని సరఫరా అవుతోందన్నారు. ప్రతి నాలుగు బాటిళ్లలో ఒకటి నకిలీ బాటిల్ ఉందన్నారు. పేదలకు విద్య, వైద్యం దూరం చేసేందుకే మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రైవేటీకరణకు అడ్డుకునేందుకు అందరం సమష్టిగా కృషి చేయాలన్నారు.
- రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీని పటిష్టం చేసుకోవాలన్నారు. జగన్ 2.0లో కార్యకర్తలు ద్వారానే ప్రభుత్వ పాలన జరుగుతుందని తెలిపారు.
- బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒక్క మెడికల్ కాలేజీ కూడా రాలేదని, ఒకట్రెండు వచ్చినా అవి ప్రైవేటు కాలేజీలేనని తెలిపారు.

మాజీ సీఎం వైఎస్ జగన్ 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను తెస్తే వాటిని పీపీపీ పద్ధతిలో ప్రైవేటుకు అప్పగించడం దారుణమన్నారు.

- మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రమంతా నకిలీ మద్యం సరఫరా అవుతోందన్నారు. నకిలీ మద్యం స్కాంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.
- మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదన్నారు. యూరియా బ్లాక్‌లో కొనాల్సిన దుస్థితి ఉందన్నారు.
- వైఎస్సార్‌సీపీ జోనల్ కో ఆర్డినేటర్ చల్లా మధుసూదనరెడ్డి మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ఉద్యమం చేపట్టాలని పార్టీ నిర్ణయించిందని, దాన్ని పార్టీ కార్యకర్తలు జయప్రదం చేయాలన్నారు. నవంబర్ 22 వరకూ గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించాలని, ఆ క్రమంలోనే గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ చేయాలన్నారు. ఈనెల 28న నియోజకవర్గాల స్థాయిలో ర్యాలీలు చేపట్టాలని, నవంబర్ 12న జిల్లా స్థాయిలో సంతకాల సేకరణ చేపట్టాలన్నారు.



కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ కమిటీల నుంచి రాష్ట్ర స్థాయి వరకూ పార్టీని బలోపేతం చేసుకోవాలన్నారు. గతంలో మాదిరి ఇంట్లో, ఆఫీసులో కూర్చొని పేర్లు రాసి పంపితే చెల్లదన్నారు. గ్రామాల్లోకి వెళ్లి కమిటీలను తయారు చేయాలన్నారు. ఈ విధంగా కమిటీలను ఏర్పాటు చేస్తే ప్రతి నియోజకవర్గానికి కనీసం వేల మంది పార్టీ కార్యకర్తలు తయారవుతారని, ఫలితంగా పార్టీకి, కార్యకర్తలకు మధ్య బంధం బలపడుతుందని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటు పరిశీలకులు కొండూరు అజయ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పి. రామసుబ్బారెడ్డి, డీసీ గోవిందరెడ్డి, ఎంపీ రామచంద్రారెడ్డి, రమేష్ యాదవ్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రామమల్లు శివప్రసాద్‌రెడ్డి, మాజీ మేయర్ కె. సురేష్ బాబు, సీఈసీ సభ్యులు మల్లికార్జునరెడ్డి, ఎస్‌ఈసీ సభ్యులు మాసీమ బాబు, ఆర్. వీరారెడ్డి, ఇ. తిరుపాలిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పోతుల శివారెడ్డి పాల్గొన్నారు.

మద్యంలో 25 శాతం నకిలీదే

- నకిలీ మద్యం స్కాంలో ఉన్నవారంతా చినబాబు సన్నిహితులే
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధ్వజం

కడప కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వం సరఫరా చేస్తున్న మద్యంలో 25 శాతం నకిలీదేనని, ప్రతి నాలుగు బాటిళ్లలో ఒకటి నకిలీదని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. గురువారం కడపలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 16 నెలల్లో ప్రతిరోజూ ఏదో ఒక అవినీతి కార్యక్రమం చేస్తున్నారని విమర్శించారు. ఈ ప్రభుత్వానికి ఒట్టేసిన పాపానికి ఏరువులు, విత్తనాలు లేక రైతులు బాధపడుతున్నారన్నారు. తంబళ్లపల్లెలో లక్షలాది నకిలీ మద్యం బాటిళ్లు బయటపడ్డాయని, ప్రభుత్వం సరఫరా చేసే మద్యంలో 25 శాతం నకిలీదేనన్నారు. ఇంత జరుగుతున్నా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఇంటెలిజెన్స్, పోలీసు, ఎక్సైజ్ వారికి తెలియకపోవడం హాస్యాస్పదమన్నారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడిందని, అనకాపల్లి దొరికిన బాటిళ్ల లెక్కల్నిబట్టి ఇతర రాష్ట్రాలకు కూడా వెళ్లిందని, ఇతర రాష్ట్రాల వారే దీన్ని బయటపెట్టారన్నారు. నెల్లూరు, ఒంగోలు, కృష్ణా, ఇబ్రహీంపట్నం, ఏలూరు, అనకాపల్లి ప్రాంతాల్లో నకిలీ మద్యం తయారీ కేంద్రాలు బయటపడ్డాయన్నారు. ఇవన్నీ బయటపడటంతో వాటికి సారథ్యం వహించేవారంతా చినబాబు సన్నిహితులేనని ఆరోపించారు. తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి తన కోవర్టుగానే రూ.50కోట్లు తీసుకుని టికెట్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఆయన మరో రూ.50 కోట్లు ఎన్నికల్లో ఖర్చు చేశారని, తన కోవర్టు అయితే ఇంతకాలం వారు ఎందుకు పట్టుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. బీసీ లిక్కర్ తాగి అనేకమంది చనిపోతున్నారని, తమ ఆదాయం కోసం ఇంత నీచానికి దిగజారడం దారుణమన్నారు. పచ్చ మీడియా సిగ్గులేకుండా ప్రవర్తిస్తోందని, ఎవరైతే ఈ తప్పులను దాచిపెట్టి, మూసిపెట్టడం అన్యాయమన్నారు. ఏదో ఒకరోజు వారు దీనికి పశ్చాత్తాపపడక తప్పదని హెచ్చరించారు. నిర్మలమైన పాలనలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు అద్భుత స్పందన వచ్చిందని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ప్రభుత్వాలు కూడా లెక్క చేయకుండా లక్ష మంది జనం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు.

నకిలీ మద్యం స్కాంపై సీబీఐ విచారణ జరపాలి

మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలో జరిగిన నకిలీ మద్యం స్కాంపై సీబీఐతో విచారణ చేయించాలని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా డిమాండ్ చేశారు. గురువారం కడపలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మద్యం పేరు చెబితే చంద్రబాబు గుర్తుకు వస్తారని, ఎన్‌టీఆర్ ప్రవేశపెట్టిన మద్యపాన నిషేధానికి తూట్లు పొడిచిన ఘనత బాబుదేనన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చిందని ఎద్దేవా చేశారు. తంబళ్లపల్లెలోని మొలకలచెరువు, ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం గుట్టు రట్టయిందన్నారు. కుటీర పరిశ్రమ లాగా తయారీ కేంద్రాలను నడుపుతున్నారని, వీటిలో వందల కోట్ల నకిలీ మద్యం పట్టుబడిందన్నారు. స్పిరిట్‌తో వాటిని తయారు చేస్తున్నారని, నకిలీ మద్యం సరఫరా ద్వారా ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారని ధ్వజమెత్తారు. పెదబాబుకు, చినబాబుకు తెలియకుండానే ఇదంతా జరుగుతోందా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. నకిలీ మద్యం స్కాంను వెలుగులోకి తెచ్చిన ఎక్సైజ్ సీఐ హిమబిందును సస్పెన్షన్ బహుమతిగా ఇచ్చిన ఏకైక ప్రభుత్వం ఇదేనన్నారు. నకిలీ మద్యంపై ఫేక్ ప్రచారం చేస్తున్నారని చంద్రబాబు చెప్పడం దారుణమన్నారు. రాష్ట్రంలో అన్ని అరాచకాలు జరుగుతుంటే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎక్కడ దాక్కున్నారని, తన ప్యాకేజీ పోతుందని నోరు మెదపడం లేదా అని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు నాగయ్య, నాయకులు బసవరాజు, మునిశేఖర్‌రెడ్డి, గౌస్, కార్పొరేటర్లు షఫీ, అజ్మతుల్లా, కె. బాబు పాల్గొన్నారు.

అభివృద్ధిలో లక్ష్యసాధనకు కృషి

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

కడప సెవెన్‌రోడ్స్ : ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను నిర్దేశిత లక్ష్యం మేరకు పూర్తి చేయాలని కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి జీఎస్‌డబ్ల్యూఎస్ సేవలు, వైద్య ఆరోగ్య సదుపాయాలు, పారిశుధ్యం, రైతు సేవా కేంద్రాల్లో సేవలు, పీఎంఏవై, ఎస్సీ, ఎస్టీ ఆటాసిటీ పరిహారం తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. కడప కలెక్టరేట్ మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తోపాటు జేసీ అదితి సింగ్ హాజరయ్యారు. సీఎస్ వీసీ ముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, డ్రగ్స్ పంపిణీ, ఆసుపత్రులలో పారిశుధ్యం, ఆసుపత్రులలో రోగ నిర్ధారణ సేవలపై దృష్టి సారించాలన్నారు. దీంతోపాటు పలు సూచనలు చేశారు. సీపీఓ హరిహరప్రసాద్, జెడ్పీ సీఈవో ఓబులమ్మ, మెప్మా పీడి కిరణ్ కుమార్, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయాలి

జిల్లాలో వరి ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, వ్యవసాయ శాఖ అధికారులు, సివిల్ సప్లై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని అన్నారు. జిల్లాలో ఏర్పాటు చేయనున్న దాదాపు 9 ఆర్‌ఎస్‌కే కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందన్నారు. ఖరీఫ్ సీజనుకు సంబంధించి కనీస మద్దతు ధర క్వింటాలుకు గ్రేడ్ 'ఏ' రకానికి రూ.2389 లుగా, సాధారణ రకానికి రూ.2369 లుగా మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రస్తుతం వేంపల్లి–1, కమలాపురం–2, సిద్దవటం–1, చెన్నూరు–2, ఖాజీపేట–1, వల్లూరు మండలం–1,పెన్నా పేరూరు–1లలో తొమ్మిది ఆర్ఎస్కెలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈనెల 15 నుంచి ప్రభుత్వం మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేస్తామని కలెక్టర్ వివరించారు.

వైద్య రంగానికి జీఎస్టీ నుంచి మినహాయింపు



జీఎస్టీ అవగాహన ర్యాలీలో పాల్గొన్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఇతర శాఖ అధికారులు

కడప రూరల్ : వైద్య రంగానికి సంబంధించిన అంశాలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ నుంచి మినహాయింపు ఇచ్చిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎంఎంహెచ్ నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు జీఎస్టీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ వైద్య సేవలు, వ్యక్తిగత ఆరోగ్య బీమా పాలసీ ప్రీమియంపై జీఎస్టీని పూర్తిగా తొలగించారని పేర్కొన్నారు. దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన మందులు, డయాగ్నొస్టిక్ టెస్ట్ కిట్స్‌పై కూడా పన్ను మినహాయింపు ఉందన్నారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రాకేష్ మాట్లాడుతూ ప్రజలకు జీఎస్టీపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ సేల్స్ టాక్స్ ఆఫీసర్ పద్మావతి, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అవార్ అఫ్జర్, డాక్టర్ శశి భూషణ్ రెడ్డి, డాక్టర్ ఉమా మహేశ్వర కుమార్, డాక్టర్ లలితాంబ, డెమో ఖాతీ, జిల్లా మలేరియా అధికారి మనోరమ, పెద్ద సంఖ్యలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విదేశాల్లో హోం కేర్ నర్సు ఉద్యోగాలు

కడప రూరల్ : ఖతర్, దోహ దేశాల్లో హోం కేర్ నర్సు ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ హిదాయతుల్లా తెలిపారు. బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం నర్సింగ్ అర్హత కలిగి, 21 నుంచి 40 ఏళ్లలోపు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు, రెండేళ్ల అనుభవం కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఖతర్‌లో ఒక నెలసరి వేతనం రూ 1.20 లక్షలు, కాంట్రాక్ట్ వ్యవధి రెండేళ్లు ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు విద్యార్హతలు, అనుభవం సర్టిఫికెట్, ఫొటోలతో తమ దరఖాస్తులను ఈనెల 12వ తేదీ లోపు పంపాలన్నారు. 13వ తేదీన విజయవాడలో రమేష్ హాస్పిటల్ రోడ్డులోని ఏపీ ఎన్ఆర్టీ ఆఫీస్, ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లో జరుగుతాయన్నారు. పూర్తి వివరాలకు సెల్ నెంబరు 08562-241137ను సంప్రదించాలన్నారు. అలాగే తమ దరఖాస్తులను ఏపీ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్, హెడ్ ఆఫీస్ 39–3–1, మూడవ అంతస్తు, అంజనేయ కాంప్లెక్స్, ఎంజీ రోడ్డు, లబ్బీపేట, విజయవాడ అనే చిరునామాకు పంపాలని తెలిపారు.

పొగాకు రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ప్రతిజ్ఞ చేయిస్తున్న శ్రీవాణి తదితరులు

రాయచోటి జగదాంబసెంటర్ : పొగాకు రహిత సమాజాన్ని నిర్మించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని జాతీయ పొగాకు నియంత్రణ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీవాణి కోరారు. గురువారం రాయచోటిలోని డైట్ కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ సిగరెట్లు, ఇతర పొగాకు సంబంధిత ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రజలందరూ మంచి ఆహారపు అలవాటులను అలవరచుకోవాలని, పొగాకు, వాటి ఉత్పత్తులకు దూరంగా ఉండాలని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న వారిచేత పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

కార్యక్రమంలో డైట్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ ఎం.నర్సింహారెడ్డి, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సుమతి, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, అధ్యాపకులు శివశంకర్, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమిపై గురువుల తిరుగుబావుటా!

- ప్రభుత్వ పాఠశాలల్లో బోధనేతర కార్యక్రమాలన్నీ నిలుపుదల
- నేటి నుంచి అన్ని పాఠశాలల్లో అమలుకు గురువుల అడుగులు



కలెక్టర్ కార్యాలయ ఏఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖలు విద్యారంగంలో అవలంభిస్తున్న ప్రయోగాలను, తిరోగమన విధానాలను వ్యతిరేకిస్తూ గురువులు తిరుగుబావుటా ఎగురవేశారు. పాఠశాలల్లో ఈనెల 10వ తేదీ నుంచి బోధనేతర కార్యక్రమాలను బహిష్కరించనున్నారు. ఈ మేరకు ఫ్యాప్టో నిర్ణయం తీసుకుంది. ఈ నెల 7వ తేదీ విజయవాడలో జరిగిన ఫ్యాప్టో రాష్ట్రకార్యవర్గంలో తీసుకున్న నిర్ణయాన్ని శుక్రవారం నుంచి అమలుకు శ్రీకారం చుడుతున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన తప్ప మరే ఇతర కార్యక్రమాలను నిర్వహించకూడదని ఫ్యాప్టో నిర్ణయించారు. ఈ మేరకు శుక్రవారం ఫ్యాప్టో నాయకులు కలెక్టర్‌తోపాటు డీఈఓ, ఆయా మండలాల ఎంఈఓలకు వినతిపత్రాలను అందజేసనున్నారు.

లెక్కలేనన్ని బోధనేతర కార్యక్రమాలు

జూన్ నెల నుంచి యోగాంధ్ర పేరుతో కార్యక్రమాలు, మెగా పేరెంట్ టీచర్ మీటింగ్, జీఎస్టీ 2.0 పేరుతోనే మొక్కల పెంపకం, విద్యార్థుల వివరాలు, విద్యా కానుకలను విద్యార్థులకు అందజేయడం వాటి వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయడంతోపాటు రోజుకు ఒక నివేదికను ఎంఆర్సీ ఆఫీస్‌కు పంపాల్సిన పరిస్థితి ఉంది. అలాగే విద్యార్థుల అసెస్‌మెంట్ ప్రక్రియ ఆన్‌లైన్. ఇవన్నీ ఉపాధ్యాయుల బోధనకు ఆటంకం కల్గించే విషయాలని.. వీటన్నింటిని నిలిపి వేస్తున్నట్లు వారు ప్రకటించారు. దీంతోపాటు అసెస్‌మెంట్ పుస్తకాలు, టీచర్ హ్యాండ్ బుక్ ఉపాధ్యాయులకు పరిశీలించడం మంచి భారంగా మారింది. ఈ పరిస్థితులన్నీ ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నాయని వాపోయారు.

ఆర్థిక పరమైన సమస్యలను...

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు సంబంధించిన పలు రకాల ఆర్థిక పరమైన సమస్యల పరిష్కారం చేయాల్సి ఉంది. వాటన్నింటి గురించి ఏమాత్రం పట్టించుకోకుండా వాటిపై ఎటువంటి ప్రకటన చేయకుండా ఉంది. దీంతో విసిగిపోయిన గురువులు పలుమార్లు తమ ఆర్థిక సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం నిత ఉపాధ్యాయుల సమస్యల పట్టలేదు. దీంతో విసుగు చెందిన ఉపాధ్యాయులు ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తున్నారు. ఇందులో భాగంగానే పాఠశాలల్లో బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నాం



రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రయోగాలు, తిరోగమన విధానాలను వ్యతిరేకిస్తూ శుక్రవారం నుంచి పాఠశాలల్లో బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నాం. పిల్లలకు హాజరు, ఉపాధ్యాయుల హాజరు, పిల్లలకు బోధన తప్ప ఎలాంటి బోధనేతర కార్యక్రమాలు నిర్వహించం. ఈ విషయంలో ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకునే వరకు ఈ బహిష్కరణ కొనసాగుతుంది. - ఇలియాస్‌బాషా, ఫ్యాప్టో ఛైర్మన్, వైఎస్సార్‌జిల్లా

ఆర్థిక పరమైన సమస్యలను....



రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు చెల్లించవలసిన ఆర్థిక పరమైన సమస్యలను పరిష్కరించలేదు. ఈ విషయాన్ని పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాం. మా ఆర్థిక పరమైన విషయాల పరిష్కారంలో ప్రభుత్వం ఏ మాత్రం చొరవ చూపడం లేదు. కనీసం ఎటువంటి హామీని చెప్పడం లేదు. ఇవన్నీ తేలే వరకు ఉద్యమాలు కొనసాగిసాం. - రాళ్లపల్లి అబ్బుల్లా, ఫ్యాప్టో జనరల్ సెక్రటరీ, వైఎస్సార్‌జిల్లా.

కొత్త కష్టాలు!

- స్త్రీ శక్తి పథకం అమలుతో అయోమయం
- భారంగా మారిన ఆర్టీసీ అద్దె బస్సుల నిర్వహణ
- ఒకవైపు యజమానులకు తలనొప్పిగా మారుతున్న డ్రైవర్లపై దాడులు
- మరోవైపు అద్దె బస్సు నిర్వాహకులు, డ్రైవర్లను పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు
- మైలేజీ సమస్యలు, మెయింటెనెన్స్ సమస్యలతో సతమతం
- ప్రస్తుతం ఇస్తున్న అద్దెను పెంచాలంటున్న యజమానులు


జిల్లా ప్రజా రవాణాధికారికి సమస్యలు తెలియజేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లు


పల్లె వెలుగు అద్దె బస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కూటమి సర్కార్ తీరు ఆర్టీసీ అద్దె బస్సు యజమానులకు కొత్త కష్టాలను తెచ్చి పెడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం అమలు చేస్తూ పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించింది. అంతా వరకు బాగానే ఉన్నా అధిక సంఖ్యలో ఉన్న ఆర్టీసీ అద్దె బస్సులకు సంబంధించి యాజమాన్యాల సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ తీరు కారణంగా బస్సుల నిర్వహణ తమకు కష్టతరంగా మారిందని పలువురు బస్సుల యజమానులు పేర్కొంటున్నారు.

అద్దె బస్సుల డ్రైవర్లపై దాడులు

గత కొన్ని రోజులుగా ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లపై ప్రయాణికులు దాడులకు తెగబడుతున్నారు. తాము కోరిన చోట బస్సులను నిలుపకపోవడంతో వారు డ్రైవర్లతో వాగ్వాదానికి దిగుతున్నారు. కొన్ని సందర్భాల్లో స్టాపింగ్ లేకపోయినా, బస్సులోని సీట్లన్నీ నిండిపోయినా కోరిన చోట బస్సులను ఆపకపోవడంతో డ్రైవర్లను తిట్టడం, కొట్టడం తరచూ జరుగుతోంది. సిబ్బంది ప్రయాణికులను సహకరించాలని కోరుతున్నా పట్టించుకునే నాథుడే లేడు.

అద్దె బస్సు యజమానుల సతమతం..

ఏపీఎస్ ఆర్టీసీ కడప రీజియన్ పరిధిలో కడపతో పాటు మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు డిపోలు ఉన్నాయి.

గతంలో బస్సుల యజమానులు 56 సీటింగ్ కెపాసిటీతో బస్సులు నడిపేందుకు ఆర్టీసీ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. అయితే స్త్రీ శక్తి పథకం కారణంగా ఆయా బస్సుల్లో మైలేజీ దారుణంగా పడిపోయింది. సర్వీసు రూట్‌ను బట్టి టెండర్లలో కోడ్ చేసిన విధంగా పల్లె వెలుగు బస్సుకు రూ. 8–12 వరకు, ఎక్స్‌ప్రెస్‌కు రూ. 9–14 చొప్పున కిలో మీటరుకు ఇస్తున్నారు. పల్లె వెలుగు బస్సుకు లీటర్ డీజల్‌కు 5.5 కి.మీ. ప్రయాణించాలి. మైలేజీ షార్టేజీ వస్తే ఆ భారాన్ని యజమానులే భరించాలి.

దీనికితోడు మెయింటెనెన్స్‌పై ఆందోళన చెందుతున్నారు. అద్దె బస్సుల టెండర్ల సమయంలో ఉచిత బస్సు పథకం ప్రస్తావనే లేదని, తక్కువ కోడ్ చేసిన తమకు బస్సులు దక్కాయన్నారు. అయితే ప్రస్తుతం స్త్రీ శక్తి పథకం అమలు చేస్తుండడంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలోఉన్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బస్సు నిర్వాహకులు, డ్రైవర్లను పట్టించుకోని అధికారులు..

మైలేజీ సమస్యతోపాటు డ్రైవర్లపై దాడులపై బస్సుల యజమానులు, డ్రైవర్లు స్వయంగా ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. పైగా సర్దుకుపోవాలని, చిన్నచిన్న సమస్యలు సర్వసాధారణమని చెప్పడం ఆవేదనకు గురిచేస్తోందని పలువురు డ్రైవర్లు, బస్సుల యజమానులు చెబుతున్నారు. మైలేజీ సమస్యను తెలియజేసినా తామేమి చేయలేమని చెబుతున్నారని, ఇలాంటి తరుణంలో బస్సుల నిర్వహణకు తమకు సాధ్యం కాదని పలువురు తెలియజేస్తున్నారు.

భారంగా మారిన బస్సుల నిర్వహణ..



ప్రస్తుత తరుణంలో ఆర్టీసీలో అద్దె బస్సుల నిర్వహణ భారంగా మారింది. స్త్రీ శక్తి పథకం అమలయ్యాక ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నాము. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తున్నా డ్రైవర్లపై దాడులకు తెగబడుతున్నారు. దీనికితో తోడు డీజల్ మైలేజీ షార్టేజ్ రావడంతోపాటు బస్సుల నిర్వహణ భారంగా మారింది. ఆర్టీసీ చెల్లిస్తున్న అద్దె డబ్బులు ఖర్చులకే సరిపోతున్నాయి. కిలోమీటరుకు ప్రస్తుతం ఇస్తున్న ఛార్జీలను పెంచితేనే బస్సులను నడిపే స్థితి నెలకొంది.

\- ఆర్ఎస్ రాజా, అద్దె బస్సు యజమాని, కడప

డ్రైవర్లకు రక్షణ కల్పించాలి



విధి నిర్వహణలో డ్రైవర్లకు రక్షణ కల్పించాలి. అన్ని విధాల ప్రయాణికులకు సహకరిస్తున్నా దాడులు చేయడం తగదు. నిర్ణయించిన స్టాపింగ్ మేరకు బస్సులను ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవడం జరుగుతుంది. అలాగని ఎక్కడపడితే అక్కడ బస్సులను ఆపాలని కోరడం తగదు. ఆర్టీసీకి తమ వంతుగా సేవలు అందిస్తున్న డ్రైవర్ల పట్ల అధికారులు తీరు మార్చుకోవాలి.

\- వెంకటేశ్, అద్దె బస్సు డ్రైవర్

లంచం అడిగిన డాక్టర్‌కు ఉద్వాసన

కడప అర్బన్ : మానసిక వైకల్యంతో బాధపడుతున్న బాలికకు సదరం సర్టిఫికెట్ జారీ చేసేందుకు లంచం డిమాండ్ చేసిన ఒక ప్రభుత్వ వైద్యుడిని తక్షణమే విధుల నుండి తొలగించాలని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. 2022 ఏప్రిల్‌లో జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలా.. వైఎస్సార్ కడప జిల్లా ప్రభుత్వ సర్వజనాసుపత్రి (జీజీహెచ్)లో పిల్లల మానసిక వైద్య నిపుణుడిగా పనిచేస్తున్న ఒక డాక్టర్ ఆ బాలిక తండ్రి నుంచి రూ.10,000 లంచం అడిగారు. అంత ఇచ్చుకోలేనని రూ.5,000 వరకు ఇవ్వగలనని తండ్రి ప్రాధేయపడ్డారు. వైద్యుడు అంగీకరించకపోవడంతో దిక్కుతోచని ఆ తండ్రి చివరిగా రూ.7,000 ఇచ్చేందుకు సిద్ధపడ్డాడు. అయినా రూ.10,000 ఇవ్వాల్సిందేనని, అది కూడా రెండ్రోజుల్లో ఏర్పాటు చేయాలని ఆ వైద్యుడు గడువు పెట్టాడు. విధిలేని పరిస్థితుల్లో ఆ తండ్రి జిల్లా కలెక్టర్ నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు. ఈ విషయాన్ని పరిశీలించాలని అధికారులు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)ను కోరగా, వారు విచారణ చేపట్టారు. సాక్షుల వాంగ్మూలాలు, లభించిన పత్రాల ఆధారంగా లంచం ఆరోపణ వాస్తవమేనని ఏప్రిల్ 2025లో ఏసీబీ తన నివేదికలో స్పష్టం చేసింది. సదరు వైద్యుడు కాంట్రాక్ట్ సేవలందిస్తున్నందున అతనిపై తక్షణమే చర్యలు చేపట్టాలని సిఫారసు చేసింది. మానసిక సమస్యలతో సతమతమవుతున్న బాలిక దుస్థితిని గమనించకుండా తన స్వార్థం కోసం అడ్డదారులు తొక్కాలనుకున్న ఆ వైద్యుడి వైఖరిని తీవ్రంగా పరిగణించిన మంత్రి సత్యకుమార్ యాదవ్ అతనికి తక్షణమే ఉద్వాసన పలకాలని ఆదేశాలు జారీ చేశారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


విద్యుత్ షాక్‌తో మృతి చెందిన నరేష్

తొండూరు : తొండూరు మండలం మల్లేల గ్రామానికి చెందిన నరేష్ (40) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం రాత్రి మల్లేల గ్రామంలోని ఓ రైతు పొలంలో ఈ ఘటన జరిగింది. మృతుడు నరేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నరేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఘన మద్దిలేటి తెలిపారు.

వ్యవసాయ మోటార్లు చోరీ

రాజుపాళెం : మండలంలోని వెలవలి గ్రామంలో రెండు వ్యవసాయ మోటార్లు చోరీ అయ్యాయి. గ్రామానికి చెందిన రిటైర్డు పోలీసు బసవయ్య, న్యాయవాది రావుల సురేంద్రనాథ్‌రెడ్డి పొలాలకు విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. గురువారం మోటార్లను ఆన్ చేసేందుకు కాపలాదారుడు చిన్న కొండయ్య వెళ్లగా అక్కడ రెండు మోటార్లు లేవు. ఈ విషయాన్ని యజమానులకు తెలిపారు. ఈ సంఘటనపై రాజుపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెలవలి గ్రామంలో గతంలో ఏడు మోటార్లు చోరీ అయినట్లు బాధిత రైతులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణం అంబకపల్లె రోడ్డులోని స్థానిక పాల్‌రెడ్డి ఫంక్షన్ హాల్ వద్ద బొలేరో వాహనాన్ని ద్విచక్ర వాహనం ఢీకొంది.

బీహార్‌కు చెందిన శివకుమార్ పాండే దువ్వూరు మండలం లిల్లాపురం గ్రామానికి చెందిన కోట రామేశ్వరరెడ్డిలు కూలి పనుల నిమిత్తం అరటి కాయలు కోసేందుకు ప్రతిరోజు ద్విచక్ర వాహనంలో వస్తుంటారు. ఈ నేపథ్యంలో నల్లపురెడ్డిపల్లె గ్రామం రోడ్డు వైపు నుంచి ద్విచక్ర వాహనంలో వేగంగా వచ్చి బొలెరో వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇరువురికి గాయాలు కావడంతో చికిత్స కోసం వారిని 108 వాహనంలో సర్వజన ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కడపకు రెఫర్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీలో ఇరువర్గాల ఘర్షణ

డబ్బులు బాకీ విషయమై కత్తులతో దాడి


తీవ్రంగా గాయపడిన నాగయ్య

పులివెందుల రూరల్ : పులివెందుల మండలం ఆర్.తుమ్మలపల్లె గ్రామంలో గురువారం డబ్బులు బాకీ విషయమై టీడీపీకి చెందిన నాగయ్య, రామాంజనేయరెడ్డి వర్గీయులు కత్తులతో దాడి చేసుకున్నారు. ఈ దాడిలో ఇరు వర్గాలకు చెందిన నలుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. ఆర్.తుమ్మలపల్లె గ్రామానికి చెందిన నాగయ్య అనే వ్యక్తి రామాంజనేయరెడ్డి నుంచి రూ.90లక్షలు డబ్బులు తీసుకున్నాడు. ఈ డబ్బులు మూడేళ్లలోపు తిరిగి చెల్లించాలని, ప్రతి ఏడాది వడ్డీ డబ్బులు కట్టాలని ప్రామిసరీ నోటు రాయించుకున్నాడు. ఈ నేపథ్యంలో ఈ ఏడాదిలో రూ.6లక్షల వడ్డీ డబ్బులు కట్టలేదని, డబ్బుల విషయమై రామాంజనేయరెడ్డి, నాగయ్య వర్గాల వారు దాడి చేసుకున్నారు. ఈ దాడిలో నాగయ్యతోపాటు ఆయన కుమారుడు అనిల్ కుమార్, రామాంజనేయ రెడ్డి వర్గానికి చెందిన గంగాధర్ రెడ్డి, మల్లారెడ్డిలకు గాయాలయ్యాయి. దీంతో చికిత్స కోసం వారిని 108 వాహనంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. నాగయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో కడపకు రెఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఘర్షణకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ తగదు

ప్రొద్దుటూరు : మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయడం తగదని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పేదలకు ఫీజు లేకుండా అన్ని సేవలు అందుతాయని, ప్రైవేట్ ఆధ్వర్యంలో పేదలకు ఎంత వరకు సౌకర్యాలు అందుతాయని ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం పీపీపీ విధానం రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

నగరిగుట్టలో పట్టపగలే చోరీ

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని నగరిగుట్టలో నివాసముంటున్న రాజ కుల్లాయప్ప ఇంట్లో గురువారం పట్టపగలే దొంగలు పడ్డారు. రాజకుళ్లాయప్ప కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం యథావిధిగా రాజకుళ్లాయప్ప కూలి పనులకు వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడి 6 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి, రూ.20వేల నగదుతో పాటు ఒక కోడిని అపహరించుకెళ్లారని బాధితులు తెలిపారు. పులివెందుల పట్టణంలో పట్టపగలే దొంగతనాలు జరుగుతుండటంతో పులివెందుల ప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

మందులపై జీఎస్టీ రేట్లు తగ్గింపు


జీఎస్టీ తగ్గింపుపై కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని ఐ.ఎం.ఏ కార్యాలయంలో జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టాల్ ను ఏర్పాటు చేసి జీఎస్టీ రేట్ల తగ్గింపు పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. తొలుత కర్నూల్ డ్రగ్ కంట్రోలర్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్ నాగ కిరణ్ కుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్ రవి బాబు స్టాల్ ను పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత నెల 22వ తేదీ నుంచి వినియోగదారునికి మేలు జరిగేలా జీఎస్టీలో భారీ మార్పులు చేసిందన్నారు. జిల్లా కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సెక్రెటరీ కె. వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

డిమాండ్లు అంగీకరించకుంటే 15 నుంచి సమ్మె


సమావేశమైన కార్మికులు

ఎర్రగుంట్ల : విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల, ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్లను అంగీకరించకుంటే ఈ నెల 15వ తేదీ తర్వాత నిరవధిక సమ్మెకు వెళ్తామని విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.సుబ్బిరెడ్డి తెలిపారు. గురువారం ఆర్టీపీపీలోని యూనియన్ కార్యాలయంలో ఉద్యమ కార్యాచరణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కాంట్రాక్టు కార్మికులు చాలా తక్కువ వేతనాలకు పని చేస్తున్నారని వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులను విస్మరించడం పరిపాటిగా మారిందన్నారు. అలాగే విద్యుత్ ఉద్యోగులకు డీఏలు కూడా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ నెల 14వ తేదీన వర్క్ టూ రూల్ పాటిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు పార్నపల్లె విద్యార్థులు


రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన నాగ చైతన్య


రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

లింగాల : లింగాల మండలం పార్నపల్లె గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల హెడ్మాస్టర్ అర్జున్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పోరుమామిళ్లలో ఇటీవల జరిగిన సాఫ్ట్‌బాల్ ఎస్‌జీఎఫ్ అండర్–19 విభాగంలో తమ పాఠశాలకు చెందిన నాగ చైతన్య అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. అలాగే 9వ తరగతి చదువుతున్న ప్రేమ్, హరిహరన్ జిల్లాస్థాయి ఎస్‌టీఎఫ్ అండర్–17 బీచ్ వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరి ఎంపికపట్ల హెడ్మాస్టర్‌తోపాటు పీడీ విక్టర్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

శభాష్ పోలీస్!


శివుడు, రమణమ్మలతో పోలీసులు

రాజుపాళెం : ఏం కష్టమొచ్చిందో ఆ వృద్ధురాలికి జీవితంపై విరక్తి కలిగింది. కుందూనదిలో దూకేందుకు వెళుతుండగా ఆ దారిలో వెళుతున్న కొంతమంది యువకులు, ఖాకీలు గమనించి ప్రాణాలు కాపాడారు. వివరాల్లోకి వెళితే… ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ఓ కళాశాలలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న శివుడు భార్య ఈడిగ రమణమ్మ రాజుపాళెం మండలంలోని వెల్లాల గ్రామ సమీపంలోని కుందూనదిలో గురువారం దూకాలని వెళ్లింది. అయితే ఆ సమయంలో అక్కడే ఉన్న కొంతమంది యువకులు ఆ దారిలో వెళుతూ ఇదేంటి వృద్ధురాలు కుందూనది వద్ద ఉంది అని వెంటనే వారు రాజుపాళెం ఎస్ఐ కె.వెంకటరమణకు సమాచారం అందించారు. వెంటనే ఎస్ఐ పోలీసులు కిరణ్ బాబు (సీపీ 894), ఎం. రవిబాబు (పీసీ 671)లను వెల్లాల కుందూనది వద్దకు పంపారు. జీవితంపై విరక్తి చెంది కుందూనదిలోకి దూకాలనుకున్న రమణమ్మతో పోలీసులు మాట్లాడి ఆమె వివరాలు తెలుసుకొని రాజుపాళెం పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చారు. అక్కడ ఎస్ఐ వెంకటరమణ, పోలీసులు ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఆమె భర్త ఈడిగ శివుడుకు రమణమ్మను అప్పగించారు. వృద్ధ మహిళను కాపాడిన పోలీసులు కిరణ్ బాబు, రవి బాబులతో పాటు ఎస్ఐ ఏఎస్ఐలను గ్రామస్తులు శభాష్.. పోలీస్ అంటూ ప్రశంశించారు. రమణమ్మ భర్త శివుడు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

కడపలో విస్తృతంగా తనిఖీలు


కడప చిన్నచౌక్ పరిధిలో తనిఖీ చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

కడప అర్బన్ : జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ ఎ.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చిన్నచౌకు పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కడప ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనుమానితులను విచారించి ఆరా తీశారు. అంబేడ్కర్ సర్కిల్, వై.జంక్షన్, అప్సర సర్కిల్ ప్రాంతాల్లో వాహనాలను, బస్సులను తనిఖీ చేశారు. బస్ స్టాండ్ ఆవరణలోని పార్సిల్ కేంద్రంలో క్షుణ్ణంగా పరిశీలించారు. లాడ్జీలలో పోలీసులు ప్రతి గదిని నిశితంగా తనిఖీ చేసి, లాడ్జీలలో బస చేసిన వ్యక్తులను ప్రశ్నిస్తూ వారి వివరాలపై ఆరా తీశారు. లాడ్జీలలోని రిజిస్టర్‌ను పరిశీలించారు. లాడ్జీలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో చిన్నచౌకు సీఐ ఓబులేసు, ఎస్ఐ లు రాజరాజేశ్వర రెడ్డి, రవి కుమార్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుల కోసం ప్రత్యేక నేత్ర సంరక్షణ కార్యక్రమాలు


సూచనలు చేస్తున్న వైద్యులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలలో వయో వృద్ధుల నేత్ర సంరక్షణలో భాగంగా అత్యాధునిక నేత్ర వైద్య సేవలు అందిస్తున్నట్టు వృద్ధుల నేత్ర సంరక్షణ విభాగాధిపతి డాక్టర్ అవినాష్ పతేంగే తెలిపారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ప్రాంగణంలో ఈనెల 1వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ప్రత్యేక ఆరోగ్య సంరక్షణ అవగాహన కార్యక్రమాల ముగింపు సదస్సు గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడపలోని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలలోని వైఎస్ రాజశేఖర్ రెడ్డి క్యాంపస్‌తో పాటు తమ ఎల్వీపీఈఐ ఇతర క్యాంపస్‌లలో కూడా ఎల్డర్లీ ఐ కేర్ సెంటర్స్ (ప్రత్యేక వృద్ధుల నేత్ర సంరక్షణ కేంద్రాలు) అందుబాటులో ఉన్నాయన్నారు. ఇవి వృద్ధాప్యంలో వచ్చే నేత్ర సమస్యల పట్ల అవగాహన కల్పిస్తాయన్నారు. వృద్ధాప్యంలో కలిగే జ్ఞాపక శక్తి లోపాలు, పోషకాహార లోపం, వినికిడి లోపం, దృష్టి లోపం సమస్యలను గుర్తించి సకాలంలో చికిత్స సూచిస్తాయని చెప్పారు.

పంటల బీమా వివరాలను ఆర్‌బీకేల్లో ప్రదర్శించాలి


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : పంటల బీమా ఎంతమంది రైతులకు మంజూరైందో తెలిపే వివరాలను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించాలని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి కోరారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023 నుంచి 2024 ఖరీఫ్ వరకు ప్రధాన మంత్రి పసల్ బీమ్ యోజన కింద రూ.137 .75 కోట్లు, వాతావరణ ఆధారిత బీమా కింద సుమారు రూ.35.25 కోట్లు నిధులు విడుదలయ్యాయన్నారు. దీంతో పాటు 2022–23 రబీ కాలానికి శనగ, మినుము, పెసర, వేరుశనగ పంటలు సాగుచేసి నష్ట పోయిన 77,995 మంది రైతులకు రూ.14.46 కోట్లు విడుదలైందన్నారు. 2023 ఖరీఫ్‌లో వరి పంట సాగు చేసిన 87,143 మంది రైతులకు రూ. 15.44 కోట్లు వచ్చిందని, 2023–24 రబీలో శనగ, నువ్వులు సాగు చేసిన 90, 126 మంది రైతులకు రూ.77.74 కోట్ల నిధులు విడుదల చేశారన్నారు. 2024 ఖరీఫ్‌లో వరి, మినుము, జొన్న పంటలను సాగు చేసి నష్ట పోయిన 97,361 మంది రైతులకు రూ. 28.11 కోట్లు వచ్చింది. ఇవి కాకుండా వాతావరణ ఆధారిత బీమ కింద దాదాపు 35.25 కోట్లు వచ్చాయన్నారు. పంటల బీమాకు సంబంధించి రూ.173 కోట్లు జిల్లా కు విడుదల చేశామని 50 రోజులుగా కేవలం పత్రికా ప్రకటనలతోనే రైతులను అయోమయంలో పడేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఆయా జాబితాలను ఆర్‌బీకేల్లో ప్రదర్శించాలని కోరారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రఘునాథరెడ్డి, చీర్ల సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి

నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ దిశా నిర్దేశం



కడప అర్బన్ : త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు వీలుగా ఇప్పటినుండే తగిన ప్రణాళికలు రూపొందించాలని జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి. మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు వీలుగా సమస్యలు సృష్టించే వారు, ఎన్నికల నేరాలకు పాల్పడినవారిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా భద్రత కు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఈవ్ టీజింగ్, మహిళలు, చిన్నారులపై నేరాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి, డ్రగ్స్ పై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ఉక్కుపాదం మోపాలన్నారు. జిల్లాలో నేరాల నిరోధానికి అన్ని సబ్–డివిజన్‌లలో క్రైం పార్టీలను ఏర్పాటు చేయాలని డీఎస్పీలకు సూచించారు. రోడ్డు భద్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు ఎస్పీ సూచించారు. మైనర్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేసే వారిపై ఎం.వి యాక్ట్ మేరకు కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ కు అంతరాయం కలిగేలా రోడ్లపై అడ్డంగా వాహనాలు నిలిపి ఉంచితే సీజ్ చేసి స్టేషన్ కు తరలించాలని, జరిమానా విధించాలని ఆదేశించారు. సోషల్ మీడియా లో మహిళలపై, బాలికలపై అసభ్యకర పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత గడువులోగా, చట్ట పరిధిలో పరిష్కారం అయ్యేలా చూడాలని సూచించారు. దీపావళి పండుగ నేపథ్యంలో బాణాసంచా దుకాణాలు, గోడౌన్ లలో తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసినా, విక్రయించినా వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రొద్దుటూరు రూరల్ పరిధిలో హత్య కేసును త్వరితగతిన ఛేదించిన డీఎస్పీ పి.భావన, ప్రొద్దుటూరు రూరల్ సి.ఐ ఎం.నాగభూషణ్, సిబ్బందిని జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలు అందచేశారు.

ఈ నేర సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ (ఏ.ఆర్) బి.రమణయ్య, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎస్.సుధాకర్, కడప డీఎస్పీ ఎ.వెంకటేశ్వర్లు, ప్రొద్దుటూరు డీఎస్పీ పి.భావన, పులివెందుల డీఎస్పీ బి.మురళి నాయక్, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వర రావు, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ బాలస్వామిరెడ్డి, డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం, జిల్లాలోని సి.ఐలు, ఎస్.ఐలు, ప్రత్యేక విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.